# ఈ చిరువ్యాసము నా అదృష్టరేఖ

—వెంకట రమణరావు

మా తాతగారు మద్రాసులో సినిమాలలో పనిచేస్తున్న రోజులవి మా కుటుంబము అక్కడే ఉంది తాతగారు "చక్రపాణి" సినిమా వ్రాసిన సంవత్సరములో నేను జన్మించాను. నన్ను చూచి వారు ఆనందపడుతూ అంటూఉండేవారు— "నేను చక్రపాణి ద్వారా లక్షలాదిమందిని నవ్విస్తున్నాను నువ్వు నన్ను నవ్విస్తున్నావురా రమణా" అని నేను తప్పటడుగులు వేసింది వారి సమక్షములోనే తొలిపలుకులు పలికింది వారిదగ్గరే నా అదృష్టం అదేమో కాని వాణీసంపన్నులైన మా తాతగారే నాకు చిన్ని చిన్ని మాటలు వెన్నపూసలాగా రంగరించి నా నాలుకకు అందించారు.

వారు ప్రతి ఉదయము పెరటిలో మామిడిచెట్టుక్రింద కుర్చీవేసుకొని సినిమాస్క్రిప్టు వ్రాసేవారు. వారిపక్కనే నా చిన్న కుర్చీ దాంట్లో నేను "నాకూ చెప్పు తాతయ్యా నేనూ వ్రాస్తాను" అని వేధించేవాడినట అంత పసితనములో ఎంతో ఉత్సాహము రేకెత్తించే ఆయన సమక్షములో ఏమి గీతలు గీసేవాడినో? వాటి భావమేమిటో? ఇద్దరము ఇలా వ్రాతలో నిమగ్నమైఉండగ స్టూడియోకారు వచ్చేది. నేను గబగబలేచి నేను వ్రాసిన కాగితాలు వారువ్రాసిన కాగితాలతో జతచేసి file లో పెట్టి కారుదాకా తీసుకెళ్ళి వారికి అందించేవాడినట తాతగారు స్టూడియోలో file విప్పినప్పుడు నా వ్రాతలు కూడా కనిపించేవిట అంతటి హాస్యరచయితకు నాచిలిపి చేష్టలకు ఎంతో నవ్వు వచ్చేదిట

నాకు కొంచెము జ్ఞానము తెలిసేటప్పటికి మానాన్నగారికి హైదరాబాదు బదిలీఅయింది అక్కడ బడిలో చేరాను తరువాత నాలుగైదు సంవత్సరాలకు మా తాతగారు కూడా బదిలీఅయ్యి అక్కడకు రావటము తటస్థించింది! అప్పటినుంచి ఎక్కడ సాహితీసదస్సు జరిగినా కవితాగోష్టి జరిగినా వారితో పాటు నేనూ వెళ్ళేవాడిని మహాపండితుల సమావేశములకి ఒక "పామరుణ్ణి" "వామనుణ్ణి" నన్ను తీసుకువెళ్ళి ఆ పెద్దలందరి పేర్లు నాకు చెప్పి వారి గ్రంథాలు సాహిత్యరీతిలో బోధించి తీసుకువచ్చేవారు. ఆరీతిగా తెలుగు సాహిత్యరంగములో నేను అడుగుపెట్టి ఆ అంబాలని కొద్దికొద్దిగా అవగతము చేసుకుంటూ ఉండేవాణ్ని ఈ నాటికి వాటిని నెమరవేసుకుంటూ ఉంటాను వారు ఇప్పటికి దోసిళ్ళతో కవితామృతాన్ని నాకు అందిస్తునే ఉంటారు. ఆ మధుర భావనలో మునిగి తబ్బిబ్బవుతుంటాను— తాదాత్మ్యం పొందుతూ ఉంటాను.

మా తాతగారి కవితా ప్రావీణ్యాన్ని గురించి నాకన్న పాఠకులకే ఎక్కువ తెలుసు కాని వారిలో జీవనది వలె వెల్లువికే అనురాగ వాహినులలో ఓలలాడే భాగ్యము మాత్రము నాకే ఎక్కువ కలిగింది వారు తమ రచనలలో హాస్యాన్ని మేళవించి మధురభావనగా అందరికి అందిస్తుంటారు, మాకు సంభాషణలో ఆప్యాయత, అనురాగము, ఆదర్శము మేళవించి అందిస్తారు నాకు ఉన్న చిన్నమిత్రబృందానికి ఎప్పుడూ వెలలేని సలహాలు ఇస్తూఉంటారు మా వయసుతోపాటు పెరిగే ఉహాలకు చక్కటి రూపకల్పన చేయుటానికి వారుచేసే కృషి అపారము మా రచనాశక్తిని పెంపొందించటము కొరకు వారు పడే తాపత్రయము అనంతము.

వారు నాకు తాతగారైనా ఒక్కొక్కప్పుడు నాతో మాట్లాడుతుంటే నా వయసు స్నేహితుడితో మాట్లాడినట్లు ఉంటుంది కాని తాతగారు బోధిస్తున్నారు అనిపించదు. ఆయనలో అన్ని వయసులవారు దాగిఉన్నారా అనిపిస్తుంది వారి బోధనలు అతిమృదువుగా ఉంటాయి ఎలాంటి సమస్య వచ్చినా నవ్వుతూ పరిష్కారమార్గము తెలియజేయుటము వారిలోకల ప్రత్యేకత.

వారు ఏడుకొండలవాని భక్తులు ఎలాంటి సమయాల్లో కూడా ఆ ప్రభువును మరువరు. క్లిష్టసమస్యలు వచ్చినప్పుడు 'నేను ఆయనతో చెప్పానులే నీకు ఏమీ భయములేదు హాయిగా నిద్రపో' అని ధైర్యము చెబుతూఉంటారు వారుచేసే పూజలలో, భజనలలో, పసితనమునుంచి పాల్గొనే భాగ్యము నాకు కలిగింది వెంకటేశ్వరప్రభువు నా వయసుతోపాటు నాహృదయములో పెరిగి వరదాతగా నిలిచిఉన్నాడు.

ఈ సంచికలో పలువురు సాహితీయ దురంధరులు మా తాతగారిని గురించి వ్రాసిన రచనలలో నా వ్యాసము కూడా ముద్రణవటము నేను మా తాతగారికి మనుమడుగా జన్మించుట వలన కలిగిన మహద్భాగ్యముగా భావిస్తు ఈ వ్యాసము ముగిస్తున్నాను ★